అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 149. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.21.02.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## ఏసీబీ వలలో ఎస్సీ సహకార సంస్థ అధికారి..

హైదరాబాద్: అమృత్ తెలంగాణ:అవినీతి నిరోధక శాఖ వలకు ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ బి.ఆనంద్ కుమార్ పట్టుబడ్డాడు. గుత్తేదారుకు బిల్లు చెల్లించేందుకు ఆనంద్‌కుమార్ రూ.1.33లక్షలు డిమాండ్ చేశారు. వివిధ నిర్మాణ పనులు చేసినందుకు గుత్తేదారుకు రూ.33,32,350లు మంజూరయ్యాయి. అయితే, బిల్లు చెల్లించడానికి ఆనంద్ కుమార్ రూ.1.33 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో గుత్తేదారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రూ.లక్ష లంచం ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఆనంద్ కుమార్‌ను అరెస్టు చేసి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ తర్వాత న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## ఊటీని తలపించిన భువనగిరి..

భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి ని గురువారం ఉదయం పొగ మంచుతో కమ్మేయడంతో ఊటీని తలపించింది. భువనగిరి ఖీల్ల 8 గంటల వరకు పొగ మంచుతో కనబడలేదు. రోడ్లంతా పొగ మంచు ఉండటంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు తమ వేగాన్ని తగ్గించుకున్నాయి. మంచు కురియడంతో మొక్కలపై, చెట్లపై ఆ నీటి బింధువులు ముత్యాల మెరుస్తూ కనపడ్డాయి. వాతావరణం ఆహ్లాదకంగా ఉండడంతో ప్రజలు ఆస్వాదించారు. ఈ సుందర దృశ్యాలను భువనగిరి శివారు ప్రాంతాలలో కెమెరాల్లో బంధించుకున్నారు. గాలిలో తేమ 100% ఉండడంతో పాటు 18 డిగ్రీల సెంటిగ్రేడ్ వాతావరణం చల్లబడ్డది. గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో పొగ మంచు గాలులు వచ్చాయి.

# విద్య కేంద్రం గుత్తసొత్తు కాదు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ”విద్య అనేది కేంద్రం గుత్తసొమ్ము కాదు. ఇది ఉమ్మడి జాబితాలోని అంశం. ఆయా రాష్ట్రాలు వారి ప్రజలకు సరిపోయే విద్యాసంస్థలను, వ్యవస్థలను నిర్మించుకుంటాయి, విద్య, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కేంద్రం గౌరవించాలి. ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి పోలిక ఉండదు. స్వయం ప్రతిపత్తి లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రమూ అందించ లేదు. మోడీ సర్కార్ వైఖరి ఇలాగే ఉంటే రాష్ట్రాలు రిబ్బన్ కటింగ్‌లకే పరిమితమవుతాయి. దీనిపై అందరం ఉమ్మడి లక్ష్యంతో పోరాడుదాం” అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగిన జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో ఆయన మన రాష్ట్రం తరపున పాల్గొని ప్రసంగించారు. యూజీసీ ముసాయిదా నిబంధనల ప్రభావం, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, తెలంగాణ విద్యారంగంలో చేపట్టిన కార్యక్రమాలపై ఆయన ఈ సందర్భంగా వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ”మీరు బిల్లు చెల్లించాలి, కానీ ఫుడ్ ఆర్డర్ చేయలేరు” అనే తరహాలో యూజీసీ కొత్త నిబంధనలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలకు నిధులు సమకూర్చడంతో పాటు నిర్వహించాలని మాత్రమే కేంద్రం భావిస్తోందని విమర్శించారు. వైస్ ఛాన్సలర్ల నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు కీలకమైన నిర్ణయాల్లో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను తొలగిస్తున్నారనీ, ఇది ఇలాగే కొనసాగితే అవి నిధులను సమకూర్చడం వరకే పరిమితమ వుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ”దేశంలో విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేం. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించాలి. సహకారం అంటే బలవంతం కాదు సంప్రదింపులు అని అర్థం, కేంద్రం నిజంగా సహకార సమాఖ్య వాదాన్ని విశ్వసిస్తే రాష్ట్రాలతో చర్చించాలి. వాటి స్వయం ప్రతిపత్తిపై అత్యున్నత న్యాయస్థానం రాజస్థాన్ వర్సెస్ భారతీయ యూనియన్ కేసులో ‘భారతదేశం ఒక సమాఖ్య రాజ్యాంగంగా ఉంది” అని పేర్కొన్న అంశాన్ని భట్టి ఈ సందర్భంగా వివరించారు. కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్రం కేసులో ‘సమాఖ్య వ్యవస్థ భారత రాజ్యాంగంలోని ప్రామాణిక లక్షణం’ అని పేర్కొన్న సందర్భాన్నీ ఆయన ఉదహరించారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష తప్పనిసరి చేయడం మూలంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే అవకాశముందని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. బ్రూకింగ్స్ నివేదిక ప్రకారం దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో సగటున 690 మంది విద్యార్థులుండగా, చైనాలో అది16,000 గా ఉన్నదని తెలిపారు. మూడు వేల మంది విద్యార్థుల నమోదు కనిష్ట ప్రామాణికంగా పెడితే అనేక ఉన్నత విద్యాసంస్థలు మంచి ర్యాంకింగ్, ఫండింగ్ పొందే అవకాశాలు కోల్పోతాయని పేర్కొన్నారు. ఈ విధానం కార్పొరేట్,




ప్రయివేటు సంస్థలను ప్రోత్సహి స్తుందనీ, అదే సందర్భంలో సంక్షేమ లక్ష్యంతో పని చేసే విద్యా సంస్థలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్య విషయంలో సరైన మార్గాన్ని ఎంచుకునే అవకాశం రాష్ట్రాలకు ఇవ్వకుండా మోడీ సర్కార్ యూజీసీ విషయంలో మొండిగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకు నేందుకు మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయీ విజయన్, ఆ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి ఆర్.బిందు, కర్ణాటక మంత్రి ఎంసీ. సుధాకర్ అవారే, తమిళనాడు నుంచి తిరుగోవి చేజియాన్, పంజాబ్ నుంచి సర్దార్ హరోజ్‌సింగ్ తోపాటు ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో విద్యకు పెద్దపీట

అభివృద్ధికి విద్యను మూలస్తంభంగా భావించిన తమ ప్రభుత్వం తెలంగాణలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని భట్టి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను స్థాపిస్తున్నట్లు వివరించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని నిర్మిస్తున్నామనీ, పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు ప్రాధాన్యత క్రమంలో బోధనా సిబ్బంది పోస్టుల భర్తీ చేపట్టినట్టు తెలిపారు. ఉన్నత విద్యా వ్యవస్థ బలోపేతానికి కావాల్సిన నిధులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు వివరించారు. విద్యార్థుల నమోదు సగటు జాతీయ స్థాయిలో 28.4 శాతం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాలతో అది 40 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు.

# హైడ్రా విధుల్లో డీఆర్ఎఫ్ పాత్ర కీలకం: కమిషనర్ రంగనాథ్





హైదరాబాద్:అమృత్ తెలంగాణ: హైదరాబాద్ నగరంలో హైడ్రా నిర్వహిస్తున్న విధుల్లో డీఆర్ఎఫ్ బృందాల పాత్ర కీలకమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. డీఆర్ఎఫ్‌లోకి అవుట్ సోర్సింగ్ విధానంలో కొత్తగా నియమితులైన 357 మంది సిబ్బంది శిక్షణ ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజల అంచనాలకు అనుగుణంగా హైడ్రా పనిచేస్తోందని ఆయన తెలిపారు. డీఆర్ఎఫ్‌లోకి అవుట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన సిబ్బందికి హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీసు శిక్షణ మైదానంలో వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో డీఆర్ఎఫ్ పాత్ర ఎంతో ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం హైడ్రా విధులు కూడా అదనంగా చేరాయని తెలిపారు. హైడ్రాపై ఉన్న నమ్మకంతో ప్రభుత్వ పలు బాధ్యతలు అప్పగిస్తోందని, వాటిని సక్రమంగా నెరవేర్చాలని ఆయన సూచించారు.

# ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నం

న్యూయార్క్ :అమృత్ తెలంగాణ: ‘ఓటర్ టర్నవుట్’ కోసం భారత్‌కు 21 మిలియన్ల డాలర్లను కేటాయించాలని గత బైడెన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశ్నించారు. ‘బహుశా మరెవరినో గెలిపించేందుకు వారు ప్రయత్నించినట్లు వుంది.’ అని తాను భావిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. మియామిలో ఎఫ్ఐఐ ప్రాధాన్యతా సదస్సులో మాట్లాడుతూ ట్రంప్ పై వ్యాఖ్యలు చేశారు. గతంలోకూడా ఆయన ఇదే అంశంపై ఆందోళనల వ్యక్తం చేశారు. అటువంటి ఆర్థిక సాయం భారత్‌కు చేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. భారత ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్ల సంఖ్యను పెంచేందుకు ఈ మొత్తాన్ని అంద చేయాల్సిన అవసరాన్ని ఆయన బుధవారం కూడా ప్రశ్నించారు. భారత్‌లో అధిక సుంకాలు విధిస్తారని, ఆ స్థాయికి అమెరికా చేరుకోవడం చాలా కష్టమని ఆయన పునరుద్ఘాటించారు. భారత్‌లో ఓటర్ల శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్‌కు యుఎస్ఎయిడ్ 21 మిలియన్ల డాలర్లను అందచేసిందని ఎలన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం వెల్లడించింది. ఆ నేపథ్యంలో ట్రంప్




పై విధంగా స్పందించారు. ఎఫ్ఐఐ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ, తాను అధ్యక్షుడిని కాకముందు ప్రజల డబ్బు అంతా ఎక్కడకు పోతోందో కొన్ని ఉదాహరణలు వివరించారు. ఇందుకు చాలా ఉదాహరణలు వున్నాయని చెప్పారు. ”అందులో భాగంగానే, 21 మిలియన్ల డాలర్లు భారత్‌కు వెళ్ళాయి. అసలు అక్కడ ఓటర్ల శాతాన్ని పెంచేందుకు మనం ఇంత మొత్తం ఖర్చు పెట్టాల్సిన అవసరమేముంది? బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులను బలోపేతం చేసేందుకు 29 మిలియన్ల డాలర్లు అందచేశారు. ..నేపాల్‌లో జీవ వైవిధ్య పరిక్షణ కోసం 10మిలియన్ల డాలర్లు ఇచ్చారు. ఆసియా దేశాల పరిస్థితి బాగానే వుంది. వారికి మనం డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదు.” అని ట్రంప్ పేర్కొన్నారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమేనని, ఇలాంటి జాబితా సుదీర్ఘంగా వుందన్నారు. ఏఏ అంశాలపై అమెరికా పన్నుదారుల డబ్బు ఖర్చు చేస్తున్నారో వివరిస్తూ ఫిబ్రవరి 16న డోజ్ ఒక జాబితా ఇచ్చింది. అందులో భారత్‌కు ఇచ్చిన మొత్తం గురించి వుంది. ఆ జాబితాలోని అంశాలన్నింటినీ రద్దు చేసామని డోజ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా యుఎస్ఎయిడ్ చేపట్టే మానవతా సాయాన్ని నిలిపివేస్తూ ఈ నెల 7న డోజ్ ఆదేశాలు జారీ చేసింది.

# తొందర పడి చేర్చుకుంటే పార్టీ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పారిపోతారు

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: పార్టీని బలోపేతం చేయడానికి చాలా మందిని తొందరపడి చేర్చుకుంటారని, కానీ సిద్ధాంతపరంగా బలహీనంగా ఉన్నవారు పార్టీ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పారిపోతారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ పునరుద్ధరించే వ్యూహాన్ని చర్చించడానికి రాష్ట్ర ఇన్‌చార్జులు, పార్టీ ప్రధాన కార్యదర్శులతో ఖర్గే సమావేశం నిర్వహించారు. కొత్తగా నిర్మించిన పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ, పార్టీ ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు, బిజెపి ఓటర్ల జాబితాలో కొత్త పేర్లను జోడిస్తుందని, ఈ రిగ్గింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపాలని అన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం నిరంతర సమస్యలుగా ఉన్నాయని, ఈ సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమ ర్శించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి, ప్రతికూల పరిస్థితుల్లో కూడా మనతో ఒక శిలలా నిలబడే వ్యక్తులను మనం ప్రోత్సహించాలని అన్నారు. ‘రాజ్యాంగాన్ని కాపాడండి’ ప్రచారం కొనసాగుతోందని ఆయన అన్నారు. ఇది వచ్చే ఏడాది పాటు కొనసాగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా వివిధ కార్యక్రమాలు, సమావేశాలు వంటివి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, బికె హరిప్రసాద్, జైరామ్ రమేష్, మాణిక్‌రావ్ థాకరే, భూపేశ్ బఘేల్, సుఖ్‌జిందర్



రంధావా, మాణికం ఠాగూర్, అవినాష్ పాండే, అల్కా లాంబా, దీపా దాస్ మున్షీ, ఖాజీ నిజాముద్దీన్, కష్ణ అల్లవారు, అజరు కుమార్ లల్లు, జితేంద్ర సింగ్, రజనీ పాటిల్, కుమారి సెల్జా, కన్హయ్య కుమార్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌చార్జ్‌ల సమావేశానికి హాజరయ్యారు.

# రాజలింగమూర్తిని హత్య చేయించింది గండ్రే

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ దోపిడీని ప్రశ్నించినందుకే సామాజిక కార్యకర్త రాజలింగమూర్తిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హత్య చేయించారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, మధుసూధన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పదేండ్లలో హత్యా రాజకీయాన్ని పెంచి పోషించిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్‌తోపాటు మరో ఐదుగురిపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారని గుర్తు చేశారు. ఈ దోపిడీలో మాజీ సీఎం కేసీఆర్‌కు దోషిగా శిక్ష పడుతుందని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్ హత్య చేయించారంటూ రాజలింగమూర్తి కూతురు, భార్య చెబుతున్నారని ఆయన గుర్తు చేశారు. న్యాయ వాదులు వామనరావు దంపతుల హత్యలకు ఎవరు కారణమో తెలంగాణ ప్రజలకు తెలుసని మంత్రి ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. వరంగల్‌లో ఎంపీడీవోను బీఆర్ఎస్ నాయకులు హత్య చేశారంటూ అప్పటి సీపీ రంగనాథ్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కొడంగల్‌లో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌పై కూడా సురేష్ అనే రౌడీ షీటర్ దాడి చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగొద్దనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఉందన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందంటూ మాజీ సీఎం కేసీఆర్ అనడం పట్ల మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. హత్య రాజకీయాలతో బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. కిరాయి హత్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. 15 నెలలుగా ఫామ్‌హౌస్ నుంచి ఎప్పుడైనా బయటకు వచ్చారా? అని ప్రశ్నించారు. రాజలింగమూర్తి హత్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. హత్యలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, గండ్ర వెంకటరమణారెడ్డి పాత్ర ఉందని ఆరోపించారు. సీబీసీఐడీ విచారణ చేసి 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి వెంటనే శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. హత్యను సీఎం రేవంత్‌రెడ్డి కూడా సీరియస్‌గా తీసుకుంటారని అన్నారు. లగచర్లలో కూడా కలెక్టర్‌ను చంపాలని కుట్ర చేశారని ఆరోపించారు. తెలంగాణలో హత్య రాజకీయాలకు తావు లేదన్నారు. అవినీతిపై పోరాడే వారికి రక్షణ కల్పిస్తామని భరోసానిచ్చారు. హరీశ్‌రావు అవినీతిపై పోరాడుతున్న చక్రధర్‌కు కూడా రక్షణ




కల్పిస్తామన్నారు. తెలంగాణను దోచుకుని తిని ఎదురు తిరిగిన వారిని చంపేస్తారా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు.

కాంగ్రెస్ విమర్శలు అవాస్తవాలు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్యకు సంబంధించి వాస్తవాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ విమర్శలు చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డి కొట్టిపారేశారు. రాజలింగమూర్తి హత్యను ఖండించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక భూ వివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని గుర్తుచేశారు. కొందరి ఒత్తిడితో రాజలింగ మూర్తి భార్య తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. విచారణను ప్రభావితం చేసేలా కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. నిష్పాక్షికంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రాజలింగమూర్తి హత్యపై తెలంగాణ సీఎంవో ఆరా

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీసింది. ఈ హత్యకు గల కారణాలపై నిఘా వర్గాల నుంచి సమాచారం కోరింది.

# నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, బేగంబజార్ పీఎస్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ ఛైర్మెన్ తిరుపతి వర్మ తెలిపారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు మార్చి 23కి వాయిదా వేసింది.

# ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశంలో పాల్గొన్న బిజెపి అగ్ర నేతలు.

## గెల్పే లక్ష్యంగా బిజెపి నాయకులు కార్యకర్తలు పనిచేయాలి....... బి జె ఎల్ పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి....





ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో బిజెపి నాయకులు

నిర్మల్ ఫిబ్రవరి 20 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ జనరల్ సెక్రటరీ సునీల్ బన్సల్, రాష్ట్ర సంఘటన్ మంత్రి చంద్రశేఖర్, పాల్గొని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం దిశ నిర్దేశం చేశారు.కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గోడెం నాగేష్,ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, నిర్మల్ శాసన సభ్యులు , బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్య , జిల్లా అధ్యక్షులు, ఇంఛార్జిలు, సీనియర్ నాయకులు ,తదితరులు ఉన్నారు

# గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు ను భారీ మెజార్టీతో గెలిపించండి

నిర్మల్ / ఫిబ్రవరి 20 ( అమృత్ తెలంగాణ న్యూస్) నిర్మల్ జిల్లా కేంద్రంలోని మయూరి ఇన్ హెూటల్లో గురువారం రోజు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నిమ్మ తోట వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలకు చెందిన గ్రాడ్యుయేట్స్ తమ ఓటును ఆలోచించి వేయాలని అన్నారు. సామాజిక న్యాయం కొరకు, సమానత్వం కొరకు, బడుగు బలహీన వర్గాల కొరకు పని చేసే వ్యక్తిని చూసి అలాగే భారత రాజ్యాంగాన్ని కాపాడేటువంటి వ్యక్తిని చూసి, పేదల పక్షాన పోరాటం చేసే వ్యక్తిని, దళిత బహుజన ఉద్యమాల్లో పాల్గొంటున్న వ్యక్తిని చూసి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. విద్యావంతులు, మేధావులు, మదబలం, మంద బలం, మందు బలం మన ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన తెలిపారు. వేటికి లొంగకుండా ప్రజలకు సేవ చేసిన వ్యక్తిగా, పేదలకు అండగా నిలిచిన వ్యక్తిగా, వైద్యునిగా సేవలందించిన వ్యక్తిగా నేను ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్నాను కాబట్టి నా సేవల్ని గ్రాడ్యుయేట్స్ సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటే ఎమ్మెల్సీ ఓట్లలో నాకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామస్థాయి, మండల స్థాయి, నాలుగు జిల్లాల గ్రాడ్యుయేట్స్ తమ ఓటు వేసే ముందు సమర్థవంతమైన నాయకున్ని ఎంచుకొని ఓటు వేయాలని ఆయన తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించినటువంటి రాజ్యాంగాన్ని, అమలు పరచకుండా కొంతమంది నాయకులు,



గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి
డాక్టర్ నిమ్మ తోట వెంకటేశ్వర్లు

పక్కదారి పట్టిస్తూ బడుగు బలహీన వర్గాలను పైకి రాకుండా చూస్తున్నారు. అందుకే నాలుగు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటు వేసేటప్పుడు సీరియల్ నెంబర్ 35 అలాగే డాక్టర్ నిమ్మ తోట వెంకటేశ్వర్లు పేరు గల అభ్యర్థికి ఓటు వేసి బంపర్ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# ఏమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, నీ కలిసిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు.


## ఎస్సీ వర్గీకరణ లో మాలలకు అనుకూలంగా అసెంబ్లీలో మాట్లాడాలని మాలమనాడు నాయకుడా వినతి పత్రం అందజేత



బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డికి వినతి పత్రం
అందజేస్తున్న మాల మానాడు నాయకులు



మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ ముధోల్ ఇంచార్జి నారాయణరావు
పటేల్ కు వినతి పత్రం అందజేస్తున్న మాల మానాడు నాయకులు



మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి వినతి పత్రం
అందజేస్తున్న మాల మానాడు నాయకులు

నిర్మల్ జిల్లా ఫిబ్రవరి 20 అమృత్ తెలంగాణ గురువారం ఏమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నీ వారి నివాసం లో కలిసి ఎస్సీ వర్గీకరణలో మాలలకు జరిగిన అన్యాయం పై అసెంబ్లీ లో చర్చ చేయాలని కోరడం జరిగింది దానికి సానుకులంగా స్పందించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లాఅధ్యక్షుడు కోప్పుల రమేష్, మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లులో 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడాన్ని మాల ఉపకులాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు ప్రభుత్వం వెంటనే ప్రస్తుత ఎంపరికల్ డేటా తీసి దాని ప్రకారం సుప్రీం కోర్టు చెప్పిన విధంగా ముందుకు వెళ్ళాలి అని అన్నారు జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోక పోతే కాంగ్రెస్ పార్టీ నీ బొంద పెడతామని హెచ్చరించారు, ఉమ్మడి అదిలాబాద్ మాల సంఘం నాయకులు బెర దేవన్న, ముల్కల రాజేశ్వర్, పాశం రాఘవేందర్,మేదరి స్వామి, సింగరి అశోక్, నిర్మల్ జిల్లా కన్వీనర్ కుంటోళ్ళ వెంకట స్వామి, కో కన్వీనర్లు బొడ్డు లక్ష్మణ్, ఆకుల రమేష్, పులి అశోక్, కాంతంమురలీధర్, పురుషోత్తం, దేవాల మధు,మధస్తు భుమేశ్, శ్రీనివాస్, సాయనున్న, నర్సన్న, రాజలింగం, సంపత్, రాజు, వినోద్, నవీన్, సుధీర్

# ఎస్సీ వర్గీకరణ బిల్లును కాంగ్రెస్ పార్టీ వెంటనే వెనక్కి తీసుకోవాలి..

## ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ డిమాండ్,



ఎస్సీ వర్గీకరణ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా
అధ్యక్షుడు కొప్పుల రమేష్ మాట్లాడుతున్న దృశ్యం



ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో
నిర్మల్లో సమావేశమైన మాల మహానాడు నాయకులు

నిర్మల్ జిల్లా ఫిబ్రవరి 20 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్మల్ లోనీ మాల సంక్షేమ సంఘం భవనం లో సమావేశం నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిగా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కోప్పుల రమేష్, హాజరై మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లులో 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడాన్ని మాల మాల ఉపకులాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు ప్రభుత్వం వెంటనే ప్రస్తుత ఎంపరికల్ డేటా తీసి దాని ప్రకారం సుప్రీం కోర్టు చెప్పిన విధంగా ముందుకు వెళ్ళాలి అని అన్నారు జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోక పోతే కాంగ్రెస్ పార్టీ నీ బొంద పెడతామని హెచ్చరించారు, ఉమ్మడి అదిలాబాద్ మాల సంఘం నాయకులు బెర దేవన్న, ముల్కల రాజేశ్వర్, పాశం రాఘవేందర్, మేదరి స్వామి, సింగరి అశోక్, నిర్మల్ జిల్లా కన్వీనర్ కుంటోళ్ళ వెంకట స్వామి, కో కన్వీనర్లు బొడ్డు లక్ష్మణ్, ఆకుల రమేష్, పులి అశోక్, కాంతం మురలీధర్, పురుషోత్తం, దేవాల మధు,మధస్తు భుమేశ్, శ్రీనివాస్, సాయ నున్న, నర్సన్న,రాజలింగం,సంపత్, రాజు, వినోద్, నవీన్, సుధీర్

# పోరాడే వ్యక్తులకు పట్టం కట్టండి..

భైంసా :అమృత్ తెలంగాణ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి తగిన బుద్ధి చెప్పాలని, మేధావులు ప్రభుత్వంపై పోరాడే వ్యక్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి అన్నారు. మండలం లోని మహాగాం, చింతల్ బోరి, గుండేగాం, కోతుల్గాం, గ్రామాల్లో ప్రచార పర్వాన్ని చేపట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి కొమురయ్య కు పట్టం కట్టాలన్నారు. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆదేశాను సారం అన్ని గ్రామాల్లో



నాయకులు, కార్యకర్తలంతా కలిసి ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహాగాం తాజా మాజీ సర్పంచ్ అప్పాల రాకేష్, మాజీ సర్పంచ్ చిన్నన్న, కురుమ కృష్ణ, సోనారి యోగేష్, శంకర్, యోగేష్, భోజన్న, సాయినాథ్, తిరుపతి, దత్తాత్రి, అఖిల్ పటేల్, లక్ష్మి, గజ్జరాం తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలి.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.






సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కేజీబీవీ లక్ష్మణచందా పాఠశాలలో జిల్లా విద్యాశాఖ సహకారంతో ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్ ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి బాలశక్తి నూతన ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, జిల్లాలోని 57 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాలశక్తి కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్యం, నైపుణ్యాల పెంపు, క్షేత్ర పర్యటనలు వంటి అంశాలపై విద్యార్థినులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాలశక్తి కార్యక్రమాన్ని మరింత పటిష్టం చేయడానికి, అదనంగా ధర్మసేవ ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారథ్యంలో ధ్యానం, యోగ, నైతిక విలువలతో కూడిన విద్య, ఆటలు, మార్షల్ ఆర్ట్స్ వంటివి జోడిస్తూ, విద్యార్థులను అన్ని అంశాల్లో పరిపుష్టం చేయడం జరుగుతుందని అన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతీ విద్యార్థిని ఉద్యోగం సాధించాకనే, తమ పెళ్లి గురించి ఆలోచించాలని, ఆలోచిస్తామని విద్యార్థినులు అందరిచేత ప్రతిజ్ఞ తీసుకున్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు బోధించారు. లెక్కలను చేయించి జవాబులు రాబట్టారు.

అంతకుముందు కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్ ధీర ఫౌండేషన్ ప్రతినిధి నిశాంత్ రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపిడిఓ రాధా, విద్యాశాఖ అధికారులు పద్మ, యన్ ప్రవీణ్ కుమార్, వినోద్ కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి నవిత, ప్రత్యేక అధికారినులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాలి..



జన్నారం :అమృత్ తెలంగాణ: నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసే కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పైడిపల్లి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన, ఎమ్మెల్సీ సన్నాక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. 500 కే సిలిండర్ అందిస్తున్నామన్నారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కులాల మతాల మధ్యలో చిచ్చు పెట్టడమే తప్ప అభివృద్ధి చేయడం లేదన్నారు. కుల గణన చేస్తే అది తప్పుడు తడకలుగా ఉందని బిజెపి బిఆర్ఎస్ పార్టీల నాయకులు అనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే కదా కుల గణన జనాభా గనన దేశమంతటా చేయొచ్చు కదా, అది చేతగాక చేసిన తెలంగాణ ప్రభుత్వాన్ని బిజెపి నాయకులు విమర్శించడం తగదన్నారు. కుల గణన పలు సమస్యలు ఏర్పడడంతో ఇప్పటికే జరిగి ఉండాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడ్డాయి అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు 54 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పట్టభద్రులు నిరుద్యోగుల తరఫున పోరాటం చేయాలంటే, తమ హక్కులను సాధించుకోవాలంటే ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ముందుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమా బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి ఆత్రం సుగుణ మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రస్తుతం స్థానిక టైగర్ జోన్ సమస్యపై మంత్రి సీతక్క దృష్టికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, రాష్ట్ర జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ముజాఫ అలీ ఖాన్ మాణిక్యం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, సుభాష్ రెడ్డి, మోహన్ రెడ్డి మిక్కిలినేని రాజశేఖర్ మామిడిపల్లి ఇందయ్య,దుమల రమేష్ కరుణాకర్, సోహెల్ ఇసాక్, పాల్గొన్నారు.

# సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం....

### తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా అధ్యక్షులు గైని సాయి మోహన్



గైని సాయి మోహన్

అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 20 ముధోల్ లో ఏర్పడేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భూపాలపల్లి జంగేడు గ్రామంలో నివసించే నాగవల్లి రాజలింగమూర్తి నిన్న సాయంత్రం ఒక శుభకార్యానికి వెళ్లి వస్తుండగా రెడ్డి కాలనీ రోడ్డు దగ్గర కొందరు గుర్తు తెలియని దుండగులు కత్తులతో విచక్షణ రహితంగా పొడిచి చంపటం జరిగింది. భూపాలపల్లి జిల్లాలో అనేక గవర్నమెంట్ భూముల మీద మరియు ప్రైవేట్ కంపెనీల మీద న్యాయస్థానాలలో రాజలింగమూర్తి కేసులు వేయడం జరిగింది...అలాగే ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి మీద కేసులు వేయటం....అందులో మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు హరీష్ రావు తారక రామారావు లాంటి వారి మీద ప్రైవేట్ కేసు వేయడం జరిగింది ఇలా ఎన్నో సమస్యల మీద చట్టం ప్రకారంగా పోరాడుతున్న రాజలింగమూర్తిని చంపడం అమానుషం అని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షులు గైని సాయి మోహన్ అన్నారు. రాజలింగమూర్తిని హత్య చేసిన వారు ఎంతటివరైనా వదలకుండా వారితో ఎంతమందికి సంబంధాలు ఉన్నాయో వారందరినీ కూడా చట్టప్రకారం శిక్షించాలని గైని సాయి మోహన్ అన్నారు

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల ఇంద్ర రెడ్డి.....



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ జిల్లా నర్సాపూర్ ఫిబ్రవరి 20 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు విట్టల్ రెడ్డి, భార్య ఆరోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు ఆయన వెంట మాజీ జెడ్పిటిసి చిన్న రామయ్య, మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, భూమేష్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, జీవన్రావు, బర్కుంట గంగారం, ఫసి, మజార్, మహేందర్, సాయందర్, జూక్కన్న, అమరేందర్, సుదర్శన్ గౌడ్, పాల్గొన్నారు

# రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై ఫిబ్రవరి 24 నుండి 28 వరకు వారోత్సవాలు

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై ఫిబ్రవరి 24 నుండి 28 వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళల కొరకు ఆర్థిక ప్రణాళిక, పొదుపు నష్ట నివారణ చర్యలు, ఆర్థిక పరిపుష్టికి రుణాలు పొందడం, గృహ రుణాలు, ఉద్యోగినులకు, స్వయం ఉపాధి పొందాలనే మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలు, ట్రాన్స్ ఉమెన్, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 25 న జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించడం జరుగుతుందని ఇందులో మహిళా సంఘాలతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# ఎల్.పి.జి గ్యాస్ ఏజేన్సి డీలర్ల తో జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం తన ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు.





గ్యాస్ సంబంధించిన డీలర్స్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఈ సందర్భంగా గ్యాస్ లబ్ధి దారుని యొక్కEKYC, నెట్ వర్క్ లేని గ్రామాలలో క్యాంపు పెట్టి EKYC చేయుట గురించి. జిల్లా లో గల సమస్త ఎల్.పి.జి డీలర్లకు ,లబ్ధి దారులకు తెలియపర్చవలసిన వివరములు ఈ క్రింది విధముగా కలదు.

1. సి.యం పైలెట్ ప్రాజెక్ట్ లో పబ్లిక్ హియరింగ్ జరుగు సమయం లో మీ యొక్క ఏజేన్సీ కి సంభందించిన వారు అందరూ తప్పకుండ హాజరు కావాలి.

2. గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేయు సమయం లో EKYC చేసుకొమ్మని డెలివరీ బాయ్ లబ్ధిదారునికి తెలియచేయాలి.

3. గ్యాస్ రాయితీ రాని వారు సంభందిత గ్యాస్ ఏజేన్సీ లో దరఖాస్తు చేసుకొమ్మని లబ్ధిదారునికి తెలియచేయాలి.

4. నెట్ వర్క్ రాని గ్రామాలలో లబ్ధి దారుల కొసం నెట్ వర్క్ వచ్చే పక్క గ్రామం లో క్యాంప్ పెట్టాలి.

లపైన తెలిపిన అంశాలను సంభందిత గ్యాస్ ఏజేన్సీ వారు తు.ఛ. తప్పకుండ పాటించాలని ఆదేశించనైనది.

# ఝార్ఖండ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గా ఎన్నికైన కొప్పుల రాజు సన్మానం



అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ :ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ లు ఝార్ఖండ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా ఎన్నికైన కొప్పుల రాజు ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ సెడమ్మకి ఆనంద్ రావు కొమరం భీమ్ జిల్లా చైర్మన్ విశ్వనాథ్ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల చైర్మన్ లు ఆత్రం రాజేశ్వర్ ఊర్వత ఆనంద్ రావు ఆత్రం వసంత్ రావు తదితరులు ఉన్నారు.

# ప్రజా పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ డీలర్లను ఆదేశించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పంపిణి పై పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారదర్శకంగా ప్రజా పంపిణి ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. లబ్దిదారులకు రేషన్ బియ్యం, నాణ్యమైన సరుకులు అందించాలని, రేషన్ షాప్ డీలర్లు సరుకులను సక్రమంగా లబ్ధిదారులకు అందించడంలో పారదర్శకత పాటించాలన్నారు. జిల్లా నుండి ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించడం జరిగిందని, బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతినెలా ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన సమయంలోగా పంపిణి ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. రేషన్ షాపులలో సరుకు నిల్వ, వివరాలకు సంబందించిన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే వారిపై కేసులు నమోదు చేయాలనీ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం గోపాల్, అధికారులు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి నరేందర్ రెడ్డి ని గెలిపించండి

### కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా



అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల అభ్యర్థి వి నరేందర్ రెడ్డి ని పట్టభద్రులందరు ఓటేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ, న్యాయవాది షబ్బీర్ పాషా కోరారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖానాపూర్ మండలం లో ఎమ్మెల్యే వేద్మ బొజ్జు పటేల్ గారి ఆధ్వర్యంలో వారి సూచనల మేరకు పట్టభద్రుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే మేనిఫెస్టోలో చూపిన విధంగా ఎన్నికల ముందే విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, పెండింగ్ లో ఉన్న డి ఎస్ సి సుమారు 1400 ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని రాబోయే రోజుల్లో ఖచ్చితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో యువకులు పట్టభద్రుల సంక్షేమానికి చేయూత నందిస్తామని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ అలాగే అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి గ్రంథాలయాల్లో ఉచిత మధ్యాహ్న భోజనం కల్పిస్తామని

హామీ ఇవ్వడం అలాగే ట్రాస్మా ఉపాధ్యాయులకు ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం స్వంత ఖర్చులతో అందిస్తామని హామీ ఇచ్చారని ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ గారి నాయకత్వం లో ఖానాపూర్ నుండి ఎమ్మెల్సీ ఓట్లు అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి నరేందర్ రెడ్డి కోసం ఓట్లు అభ్యర్థిస్తున్నామ్మని పత్రిక ప్రకటనలో తెలిపారు

# మిస్సింగ్ కేసు నమోదు



మిస్సయిన వ్యక్తి జాదవ్ గోపీచంద్,

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జీ ఫిబ్రవరి 20 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని అంజనీతాండ, గ్రామానికి చెందిన జాదవ్ గోపీచంద్, 60. బుధవారం ఉదయం ఇంటి నుండి నర్సాపూర్ జి వెళ్తున్నానని చెప్పి వెళ్లడం జరిగింది కానీ ఇప్పటివరకు ఇంటికి రాకపోయేసరికి జాదవ్ గోపీచంద్ అన్న కొడుకు జాదవ్ పిరాజి, తన బాబాయి జాదవ్ గోపీచంద్ ఆచూకీ గురించి తెలుసుకొనుటకై గురువారం పోలీస్ స్టేషన్ యందు దరఖాస్తు ఇవ్వగా ఎస్ఐ సాయికిరణ్, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

# అధికారులు తిట్టారని పురుగు మందు తాగాడు.



జన్నారం : అమృత్ తెలంగాణ:జన్నారం మండలంలోని దేవుని గూడా గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డం గూడాకు చెందిన రాథోడ్ తుకారాం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. 2 రోజులు క్రితం అటవీ అధికారులు వారి గుడిసెలను తొలగించారు. గురువారం అటవీ అధికారులు మరోసారి అక్కడికి వెళ్లి స్థలం ఖాళీ చేయాలని ఈ ప్రదేశంలో సీసీ కెమెరాలు బిగిస్తామని అనడంతో, అధికారులకు వారికి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ స్థలంలో దాదాపు 30 సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, ఎంతోమంది అటవీ అధికారులు వచ్చి బదిలీపై వెళ్లారు. కానీ మా ఇళ్లను ఎవరు తీసివేయలేదని వారికి విన్నవించారు. రెండు మూడు రోజులు సమయం ఇవ్వండి, పై అధికారులతో మాట్లాడి స్థలంపై హక్కు పత్రాలను మీకు సమర్పిస్తామని అన్నా కూడా అటవీ అధికారుల వినకుండా నానా దుర్భాషలాడారని స్థానికులు ఆరోపించారు. ఒకవేళ అధికారులు స్పందించకుంటే స్థలం పూర్తిగా ఖాళీ చేసి వెళ్తామన్న అధికారులు వినలేదన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడారన్నారు. దీంతో మనస్తాపం చెంది అతడు పురుగు మందు తాగినట్లు వెల్లడించారు. అనంతరం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాథోడ్ తుకారం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. విషయంపై జన్నారం ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావును వివరణ కోరగా, మేము ఎవరిని దురుసుగా మాట్లాడలేదని దురుసుగా ప్రవర్తించలేదని, కేవలం అటవీ భూములలో సీసీ కెమెరాలు బిగిస్తామని అంటేనే వారు గొడవకు దిగారని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అవగాహన..



ముధోల్ :అమృత్ తెలంగాణ: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం ఎంపీడీవో శివకుమార్,హౌసింగ్ డీఈఈ దయానంద్ లు ఇంది రమ్మ ఇళ్ల లబ్దిదారులకు అవగాహన కల్పించారు. వెంకటపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విధివిధానాల గురించి వారికి తెలియజేశారు .ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని త్వరలో పూర్తి వివరాలు తెలియజేస్తామని అన్నారు.ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్దిదారులకు బిస్మిట్ లెవల్, డోర్ లెవల్,స్లాప్, ప్లాస్టింగ్ చేసిన తర్వాత నాలుగు విడతలుగా డబ్బులు విడుదల చేయడం జరుగతదని సూచించారు.

# ముధోల్ లో ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం..



ముధోల్ :అమృత్ తెలంగాణ: మండల కేంద్రమైన ముదోల్ ల్లోని పశుపతినాథ్ శివాలయం ఆలయంలో గురువారం ఉదయం అఖండ హరినామ సప్తహ కార్యక్రమం ప్రారంభమైంది. బాలాజీ గురూజీ రాందాస్ గురూజీ నేతృత్వంలో ఈ సప్తాహం అంగరంగ వైభవంగా గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఉదయం వేళలో ఎక్కువ జాముల కాకడరాతి కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో హాజరావుతారు. ఈ సప్తాహం ఏడూ రోజుల పాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.








అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని టీచర్స్, గ్రాడ్యుయేషన్ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలమెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, ఓటింగ్ మెషీన్లు, ఇతర అవసరమైన సామగ్రి సమయానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు తగిన సూచనలు అందించాలని,వారికి పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో వృద్ధులు,దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, తాసిల్దారులు రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చింతకాయలు తెంపాడని.. దళితునిపై దాడి



మెదక్ :అమృత్ తెలంగాణ: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ గ్రామాల్లో భూస్వామ్య ఆధిపత్య భావజాలం కొనసాగుతుంది. ఏవో చిన్న కారణాలు చూపి దళితులపై దాడులు చేయడం, కులం పేరిట దూషించడం, గ్రామ బహిష్కరణ చేయడం పరిపాటిగా మారింది. సదాశివపేటలో మంత్రాల నెపంతో చెట్టుకు కట్టేసి కొట్టారు. మనోహరాబాద్ మండలంలో శుభ, అశుభ కార్యాలకు డప్పులు కొట్టలేదంటూ విద్యావంతులైన దళిత యువకుల్ని గ్రామం నుంచి బహిష్కరించారు. పొలం కౌలుకు చేసినందుకు దళితుడిని బండరాళ్లతో కొట్టి చంపారు. ఇలా చెబుతూ పోతే వరుస సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

చింతకాయ తెప్పించిందని దాడి, కులం పేర తిట్లు

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడపల్లి గ్రామంలో ఓ దళితుడు చింత చెట్టుకు కాయలు తెప్పినందుకు కులం పేరిట దూషించారు. ఇంట్లో నుంచి బయటికి ఈడ్చుకెళ్లి దాడి చేశారు. బాధితుడు సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీన చీకుర్తి నీలమ్మ, భర్త అమృత్ తమ వ్యవసాయ పొలం వద్ద ఉన్న చింత చెట్టుకు చింత కాయలు తెంపి తీసుకురావాలని దళితుడైన సుమన్‌కు చెప్పారు. దాంతో పొలం వద్దకెళ్లి చింత చెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా చీకుర్తి లక్ష్మణ్, అతని భార్య మమత అక్కడికి వచ్చారు. చింతకాయలు ఎవరు తెంపమన్నారంటూ నిలదీశారు. కులం పేరుతో దూషించారు. అవమానపరుస్తూ తిట్టడంతో సుమన్ తెంపిన చింతకాయల్ని అక్కడే వదిలేసి వెళ్లాడు. 14వ తేదీన సుమన్ ఇంట్లో ఉండగా చీకుర్తి లక్ష్మణ్, మమత అక్కడికెళ్లి ఇంటి నుంచి బయటికి గుంజి కులం పేరుతో అనరాని మాటలు అంటూ దూషించారు. చెట్టుకు సంబంధించిన వాళ్లు చెప్పడం వల్లనే అక్కడికెళ్లి చింతకాయలు తెంపినట్టు అందులో ఎలాంటి తప్పు లేకపోయినా తనపై దాడి చేశారని సుమన్ తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

కులం పేరుతో ఇష్టమొచ్చినట్టు తిట్టడం తో పాటు దాడి చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సుమన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడు రోజులు గడుస్తున్నా పోలీసులు సుమన్ ఫిర్యాదును పట్టించుకోలేదు. దళితుల్ని తిట్టినా కొట్టినా ఇతర ఏ పద్ధతుల్లో అవమానపర్చినా కఠినంగా శిక్షించాలని చట్టాలు చెబుతున్నాయి. పోలీసులు మాత్రం దాడిచేసిన వ్యక్తులకు చట్టాల్ని చుట్టాలుచేసి చేతులు దులుపుకున్నారు.

దాడి చేసిన పెత్తందార్లను కఠినంగా శిక్షించాలి : కేవీపీఎస్

దళితుడైన సుమన్‌పై దాడి చేసిన పెత్తందార్లను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. పిప్పడపల్లిలో

చింత చెట్టుకు కాయలు తెంపిండని చెప్పి ఇంట్లోంచి ఈడ్చుకొచ్చి కులం పేరిట తిట్టడం, దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సుమన్‌పై దాడి చేసి తిట్టిన పెత్తందార్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# పరీక్షలు సమయంలో ప్రతీక్షణం విలువైనదే

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తీర్ణత సులభం అవుతుందని, పరీక్షల కాలం లో ప్రతీ క్షణం ఎంతో విలువైనది అని ఏఎంఓ (అకడమిక్ మోనట్రింగ్ ఆఫీసర్ ) నాగరాజు శేఖర్ అన్నారు. మండలంలోని నారాయణపురం కాంప్లెక్స్ బాల మేళా లో ముఖ్య అతిధి గా పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. లక్ష్యంతో చేసిన ఏ పనిలో అయిన సత్ఫలితాలు వస్తాయని,విద్యార్థులు ప్రతీదానికి ఒక లక్ష్యం నిర్ధేశించుకోవాలని హితవు పలికారు. యూపీఎస్ తిరుమల కుంట, అశ్వారావుపేట పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం,ఎఫ్ ఎల్ ఎన్ సామర్థ్యాలు,లైబ్రరీ వినియోగాన్ని జిల్లా విద్యాశాఖ బృందం సభ్యులు ఏఎంఓ నాగరాజు శేఖర్,సీఎంవో సైదులు,ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సతీష్ లు క్షుణ్ణంగా పరిశీలించారు.వీరి వెంట ఎంఈవో ప్రసాదరావు,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఫుల్ మూన్ నైట్‌లో సుప్రీతా హై గ్లామర్ ట్రీట్!



సురేఖ వాణి కూతురు సుప్రీత నాయుడు ఇటీవల తన ట్రావెల్ డైరీ నుంచి మరికొన్ని స్టన్నింగ్ ఫోటోలను షేర్ చేస్తూ నెటిజన్లను ఆకర్షిస్తోంది. సురేఖ వాణి కూతురు సుప్రీత నాయుడు ఇటీవల తన ట్రావెల్ డైరీ నుంచి మరికొన్ని స్టన్నింగ్ ఫోటోలను షేర్ చేస్తూ నెటిజన్లను ఆకర్షిస్తోంది. ఫుల్ మూన్ నైట్ పార్టీ వేదికగా తీసుకున్న ఈ గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సుప్రీత తాజాగా పింక్ కలర్ బోల్డ్ అవుట్‌ఫిట్‌లో తన స్టైల్‌ను ప్రదర్శిస్తూ ఘాటైన లుక్‌తో మెరిసింది. ఈ ఫోటోల్లో సుప్రీతా అద్భుతమైన బీచ్ లొకేషన్‌లో కనబడుతూ స్టన్నింగ్ లుక్‌తో ఫ్యాషన్ స్టేట్మెంట్ ఇస్తోంది. బ్యాక్‌గ్రౌండ్‌లో ఫుల్ మూన్ పారడైజ్ ఫైర్ లెటర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా, ఆమె తన లుక్‌ను మరింత హైలైట్ చేస్తోంది. ఆమె మిడ్రిఫ్ కటౌట్ డ్రెస్, లూస్ హెయిర్, సింపుల్ యాక్సెసరీస్ సుప్రీత అందాన్ని మరింత ఎలివేట్ చేశాయి. బీచ్ పార్టీ మూడ్‌లో తన స్టైల్‌ను ప్రదర్శించిన సుప్రీతా, కాంప్లిమెంట్ గా సాండల్స్, మినిమల్ జ్యువెలరీతో కాస్ట్యూమ్‌ను ఎలిగెంట్‌గా మేనేజ్ చేసింది. వేడుక వాతావరణాన్ని మరింత హాట్‌గా మార్చేలా ఈ ఫోటోషూట్ ఉందని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. ఫుల్ మూన్ నైట్‌లో సుప్రీతా అందం, గ్లామర్ ఒక కొత్త డైనమిక్‌ను సృష్టించాయి. సురేఖ వాణి కూతురిగా మాత్రమే కాకుండా, సుప్రీత తన ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో స్టన్నింగ్ లుక్స్ షేర్ చేస్తూ, నెటిజన్లను రంజింపజేస్తోంది. ఆమె స్టైల్ సెన్స్, గ్లామర్ డోస్‌ను అభిమానులు విపరీతంగా ఆస్వాదిస్తున్నారు.

# కింగ్ డమ్ తర్వాత.. కథ వేరే లెవెల్ అట..!

ఇక ఇదిలా ఉంటే కింగ్ డమ్ సినిమా తర్వాత సినిమాలు కూడా విజయ్ దేవరకొండ నెక్స్ట్ లెవెల్ ప్లానింగ్ తో వస్తున్నట్టు తెలుస్తుంది. యూత్ లో సూపర్ ఫాలోయింగ్ ఉన్న విజయ్ దేవరకొండ తన రౌడీ ఫ్యాన్స్ ని అలరించడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాడు. లాస్ట్ ఇయర్ ఫ్యామిలీ స్టార్ సినిమా ఫెయిల్యూర్ తో ఆలోచనలో పడ్డ విజయ్ దేవరకొండ ఇక మీదట పరుగెత్తాల్సిందే అని ఫిక్స్ అయ్యాడు. ఈ క్రమంలోనే గౌతం తిన్ననూరి డైరెక్షన్ లో కింగ్ డమ్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా విషయంలో మేకర్స్ ఎంత పెద్ద స్కెచ్ లో ఉన్నారన్నది రీసెంట్ గా వచ్చిన టీజర్ చూస్తే అర్ధమవుతుంది. మాటల్లేవ్ మాట్లాడుకోడాల్లేవ్ ఇన్నాళ్లకు విజయ్ దేవరకొండ స్టామినాకు తగిన సినిమా పడిందని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. కింగ్ డమ్ సినిమా చాలా పెద్ద కథగానే ఉండబోతుంది. సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ సినిమాను ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కిస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే కింగ్ డమ్ సినిమా తర్వాత సినిమాలు కూడా విజయ్ దేవరకొండ నెక్స్ట్ లెవెల్ ప్లానింగ్ తో వస్తున్నట్టు తెలుస్తుంది. కింగ్ డమ్ తర్వాత రవికిరణ్ కోలా డైరెక్షన్ లో



సినిమా చేస్తున్నాడు విజయ్ దేవరకొండ. సూపర్ హిట్ మూవీ ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కాస్టింగ్ ని కొత్త వాళ్లని ఎంపిక చేసేలా ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. ఈ సినిమా కూడా తెలంగాణా బ్యాక్ డ్రాప్ లో విలేజ్ డ్రామాగా రాబోతుందని తెలుస్తుంది. ఇది కూడా పక్కా మాస్ సినిమాగా వస్తుందని టాక్. ఇక ఈ సినిమా తర్వాత శ్యామ్ సింగ రాయ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ డైరెక్షన్ లో కూడా విజయ్ దేవరకొండ సినిమా రాబోతుంది. విజయ్ తో ఆల్రెడీ టాక్సీవాలా తీసి సక్సెస్ అందుకున్న రాహుల్ ఈసారి ఒక పీరియాడికల్ కథతో వస్తున్నట్టు తెలుస్తుంది. సో కింగ్ డమ్ తో మొదలవుతున్న విజయ్ మాస్ విధ్వంసం రాబోయే సినిమాలన్నిటికీ కొనసాగించేలా ఉన్నాడని తెలుస్తుంది. విజయ్ దేవరకొండ చేస్తున్న ఈ సినిమాల మీద ఫ్యాన్స్ కూడా సూపర్ ఎగ్జైటెడ్ గా ఉన్నారు. సినిమా నిర్మిస్తున్న ప్రొడక్షన్స్ కూడా విజయ్ దేవరకొండ రేంజ్ పెంచేలా బడ్జెట్ విషయంలో కాంప్రమైజ్ అవ్వట్లేదని తెలుస్తుంది. మరి విజయ్ దేవరకొండ ఏం చేస్తాడన్నది చూడాలి. కింగ్ డమ్ లో విజయ్ సరసన భాగ్య శ్రీ బోర్స్ నటిస్తుంది. రవికిరణ్ ఇంకా రాహుల్ సినిమాలో హీరోయిన్స్ ఎవరన్నది కూడా తెలియాల్సి ఉంది.






శివానీ హాట్ ఇన్ బ్లాక్

# కెరీర్లో ఏదీ ప్లాన్ చేసుకోలేదంటున్న సేతుపతి

గతేడాది విడుదలై-2తో ప్రేక్షకుల ముందుకొచ్చిన మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఆ సినిమాతో తమిళనాడులో మంచి హిట్టే అందుకున్నాడు. గతేడాది విడుదలై-2తో ప్రేక్షకుల ముందుకొచ్చిన మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఆ సినిమాతో తమిళనాడులో మంచి హిట్టే అందుకున్నాడు. కానీ తెలుగులో మాత్రం విడుదల2 మూవీకి అనుకున్నంతగా ఆదరణ దక్కలేదు. ప్రస్తుతం సేతుపతి ఏస్, ట్రైన్ అనే రెండు సినిమాలు చేస్తున్నాడు. ఈ రెండు సినిమాలపై భారీ అంచనాలే ఉన్నాయి. రీసెంట్ గా విజయ్ సేతుపతి ఓ కాలేజ్ ఈవెంట్ కు చీఫ్ గెస్టుగా హాజరై పలు ముఖ్య విషయాలను విద్యార్థులకు సూచించాడు. అందరూ సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని, ఎందుకంటే మీ మనసుని టార్గెట్ గా చేసుకుని అనవసరమైన కంటెంట్ ను అందులో పోస్ట్ చేస్తారని, చూసిన ప్రతీ దాన్నీ నమ్మొద్దని, తెలివిగా ఆలోచించి ముందడుగు వేయాలని విద్యార్థులకు సూచించాడు సేతుపతి. సమయం ఎంతో విలువైనదని, ఆ విలువైన సమయం గడిచిన తర్వాత మాత్రమే మనకు దాని విలువ తెలుస్తోందని, అందుకే కుదిరినంత వరకు సమయాన్ని సద్వినియోగం చేసుకోమని సూచించిన సేతుపతి, జీవితం ఎంతో అద్భుతమైనదని, దాన్ని సంతోషంగా మాత్రమే గడపమని




విద్యార్థులకు సలహా ఇచ్చాడు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థులు మీరు అజిత్ తో కలిసి ఎప్పుడు నటిస్తారని సేతుపతిని అడగ్గా దానికి సమాధానంగా, అజిత్ చాలా మంచి వ్యక్తి అని, గతంలో తామిద్దరూ కలిసి నటించే అవకాశం వచ్చినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా ముందుకెళ్లలేదని, ఆయనతో కలిసి నటించే ఛాన్స్ కోసం తాను కూడా ఎదురుచూస్తున్నట్టు విజయ్ సేతుపతి తెలిపాడు. ఇక తన కెరీర్లో ఇప్పటివరకు ఏదీ ప్లాన్ చేసుకోలేదని, తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లడం మాత్రమే తనకు తెలుసని సేతుపతి తెలిపాడు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com